కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38 (శుక్రవారం)
కనిష్ఠం : 27

కాకినాడలో తిరంగ ర్యాలీ విజయవంతం

కాకినాడ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులకు, పాకిస్థాన్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం కాకినాడ నగరంలో నిర్వహించిన తిరంగ ర్యాలీ విజయవంతమైంది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీ మెయిన్‌రోడ్ టూటౌన్ సెంటర్ నుంచి బాలాజీచెరువు సెంటర్ వరకు కొనసాగింది. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అతిథులుగా పాల్గొన్నారు. వంద అడుగుల జాతీయ జెండాను ప్రదర్శనగా తీసుకెళ్లారు. ఓపెన్ టాప్ జీపుపై సైనికులు, భరతమాత వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ సైనికులను సత్కరించారు. పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు, ప్రజలు పాల్గొని జాతీయ జెండాలను పట్టుకుని దేశభక్తి చాటారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, బీజేపీ మాజీ అధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణ రాజు, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, పంతం సందీప్, కొల్లాబత్తుల అప్పారావు, నల్లూరి శ్రీనివాస్, ఏవీడీ మెంటారావు, జొన్నాడ వెంకటరమణ, తుమ్మల కొండలరావు, కొక్కిలగడ్డ గంగాధర్, తుమ్మల సునీత, సాలగ్రామ లక్ష్మీప్రసన్న, గోడి సత్యవతివెంకట్, పాలిక నాని, పొంగా బుజ్జి, అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

త్రివర్ణ పతాక రెపరెపలు





కాకినాడ నగరంలో శుక్రవారం నిర్వహించిన తిరంగ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల తదితరులు, ర్యాలీలో జాతీయ పతాకాలతో పాల్గొన్న జనం, మహిళలు





ర్యాలీ సందర్భంగా మాజీ సైనికులను సత్కరించిన దృశ్యం

విజిట్



జాగునికీకరణ!

కాల్వల ఆధునికీకరణ ఊసేది

- పూడుకుపోయిన కాల్వలు
- ఎక్కడికక్కడ శిథిలమైన లాకులు
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- కూటమిలోనూ అరకొరే నిధులు
- నేటికీ ఆరంభం కాని పనులు
- కాల్వలు కట్టేసి 20 రోజులు
- మరో పది రోజుల్లో నీరు విడుదల
- ఎక్కడి సమస్యలు అక్కడే

కాలువలు కట్టేశారు.. అప్పుడే 20 రోజులైపోయింది.. అయినా కాల్వల ఆధునికీకరణ ఊసేలేదు.. దీంతో ప్రస్తుతం కాలువలు అధ్వానంగా ఉన్నాయి. గతంలో ఏ ప్రభుత్వమైనా ఆపరేషన్ అండ్ మెయింట్‌నెన్స్ (ఓఅండ్ ఎం) పేరుతో ప్రతి ఏటా కాలువల క్లోజర్ సమయంలో ఆధునికీకరణ పనులు చేపట్టాలి. వైసీపీ హయాంలో అసలు పట్టించుకోలేదు. 2017 టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రధాన పంట కాల్వలను అభివృద్ధి చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఈసారి మొత్తం పనులపై దృష్టి పెట్టాలని భావించింది. ఈ మేరకు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 33 నియోజకవర్గాల్లో రూ.68.64 కోట్లతో 1,747 పనులు చేయాలని ప్రతిపాదన పంపారు. రాష్ట్ర కేబినెట్‌లో రూ.35.8 కోట్లతో 877 పనులు మంజూరు చేశారు. కోనసీమ జిల్లా పరిధిలో 452 పనులకు 18.15 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.5 లక్షలు, రూ.10 లక్షలుగా వర్కులు విభజించి కాంట్రాక్టర్లు ఈ పనులు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే వీటిలో కాలువల పూడికతీత, తూడు తొలగింపు, షట్టర్ల మరమ్మతులు వంటి చిన్న పనులు మాత్రమే ఉన్నాయి. - రాజమహేంద్రవరం/అమలాపురం/పి.గన్నవరం-ఆంధ్రజ్యోతి



లాకులు.. కూలిపోతున్నాయి..

మండపేట, మే16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన లాకులు శిథిలావస్థకు చేరాయి. మరోపక్క అసంపూర్తిగా మిగిలిన ఇరిగేషన్ భవనాలు, పంట కాల్వలపై వంతెనలు నేటికీ 13 ఏళ్ల నుంచి ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా పంట కాల్వలు ఆధునికీకరణ, తూడు తొలగింపు పనులు చేసేందుకు రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. దాంతో డివిజన్ పరిధిలో తాపేశ్వరం, రామచంద్రపురం, ద్రాక్షారామ, జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్ల పరిధి పంట కాల్వల్లో తూడు తొలగింపు, పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. ఆయా సెక్షన్ల పరిధిలో 16 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటి ద్వారా ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు.



తుప్పుపట్టిన లాకులు..

కడియం : కడియం కెనాల్‌పై లాకులు తుప్పపట్టి లీకులు కారుతున్నాయి. కడియంలో కాకినాడ, రామచంద్రపురం డివిజన్లకు సంబంధించిన లాకు ఉన్న 7 తలుపుల్లో 1,4 తలుపులు పూర్తిగా తుప్పపట్టి రంధ్రాలు ఏర్పడ్డాయి. గేట్ల ఎవరూ పట్టించుకోకపోవడంతో లాక్ తలుపులు తుప్పపట్టి పాడైపోయాయి.దీంతో నీరు వృథాగా పోతోంది.



చానల్స్ ఉన్నా నీళ్లు రావు

అనపర్తి : అనపర్తి పరిధి సామర్లకోట కాలువలో ఉన్న ఏడు చానల్స్‌లో ఏ ఒక్కటీ సరైన రీతిలో లేక రైతులు సాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రధానంగా అనపర్తి ఎర్రకాలువ వంతెన సమీపంలో ఉన్న నెం 3 సైడ్ చానల్ నుంచి మొత్తం 2016 ఎకరాలకు సాగునీరందుతుంది. అయితే సైడ్ వాల్స్ కూలి అవసారానికి సాగు నీరందని పరిస్థితి ఏర్పడింది.కాలువలకు నీరు విడుదల చేసే లోపు చానల్స్‌కు మరమ్మతులు చేయాల్సి ఉంది.



కుచించుకుపోతున్న కాల్వలు

సామర్లకోట : ఆధునికీకరణ పనులు అటకెక్కడంతో కాల్వలు కుచించుకుపోతున్నాయి. సామర్లకోట మండలం వేట్లపాలెం నుంచి అచ్యుతాపురత్రయం మీదుగా సముద్రంలో కలిసే ప్రధాన డ్రెయిన్, సామర్ల కోట నుంచి అచ్యుతాపురత్రయం వరకు వెళ్లే వెస్ట్ ఏలేరు డ్రెయిన్లకు సుమారు 15 ఏళ్లుగా ఆధునికీకరణ పనులు చేపట్టలేదు.సామ ర్లకోట లాకుల నుంచి పిఠాపురం బ్రాంచి కెనాల్ కాలువ పొడవునా తూడు పెరిగి ఆయకట్టులో 452 వేల ఎకరాల్లో సగానికి సాగునీరు అందట్లేదు.



అరకొర పనులతో సరి..

కొత్తపేట : ఈ సారి అరకొర పనులతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కొత్తపేట నియోజకవర్గ పరిధిలో నాలుగు ఇరిగేషన్ సెక్షన్లు ఉండగా కొత్తపేట- ముక్తేశ్వరం కాలువ పరిధిలో వాడపాలెం వద్ద రూ.10 లక్షలతో రిటైనింగ్ వాల్, పలివెల- అమలాపురం కాలువ అవిడి వద్ద రూ.9 లక్షలతో ఒక రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. డ్రెయిన్ల పూడికతీత చేపట్టనున్నారు.



పంట కాల్వలు అధ్వానం

అంబాజీపేట : పంటకాల్వలు అధ్వానంగా మారాయి. ముక్కామల నుంచి పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, అవిడి, ఇసుకపూడి, ముక్కామల, గంగలకుర్రులో పంటకాలువలు ఉన్నా యి. ముక్కామల వెస్ట్ కాలువ నుంచి గత కొన్నేళ్ల గా పంట పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. మాచవరంలో ఉన్న పంటకాలువ గుర్రపుడెక్కతో మూసుకుపోయింది.



చెత్త..చెత్తగా కాల్వలు

మామిడికుదురు : ప్రధాన పంటకాల్వలన్నీ మురికి కాల్వలను తలపిస్తున్నాయి. పెదపట్నం నుంచి మగటపల్లి వరకు, నగరం నుంచి ఈదరాడ వరకు గల ప్రధాన పంటకాల్వలన్నీ చెత్తతో దర్శనమిస్తున్నాయి. కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో అధ్వానంగా ఉన్నాయి.



కరపలో కష్టంగా...

కరప : కాకినాడ రూరల్, కరప మండలాల్లో 19 వేల ఎకరాల వరి ఆయకట్టు ఉం ది.ఈ రెండు మండలాలు సముద్రతీరానికి చేర్చి ఉండడం శివారు ప్రాంత భూములు కావడంతో వేల ఎకరాలకు ఏటా ముంపు ముప్పు తప్పట్లేదు. ఇటువంటి పరిస్థితుల్లో పంట కాలువల ఆధునికీకరణ పనులు చేపడితే ముంపు ముప్పు నుంచి రైతులకు కొంతైనా ఉపశమనం లభిస్తుంది. అధికార యంత్రాంగం ఆ దిశగా కనీస చర్యలు తీసుకోవడంలేదు.



లొల్లలో శిథిలావస్థకు చేరిన లాకులు

లొల్ల లాకులు..శిథిలం

ఆత్రేయపురం : సెంట్రల్ డెల్టా ఆయువు పట్టు లొల్ల లాకులు శిథిలస్థితికి చేరాయి. అఖండ గోదావరి నుంచి బొబ్బర్లంక ప్రధాన కాలువ ద్వారా లొల్లలాకుల వద్ద మూడు కాలువలుగా విడిపోయి 16 మండలాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తుంది. అమలాపురం, ముక్తేశ్వరం, గన్నవరం కాలువల ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఆధునికీకరణ పనుల ఊసే లేదు. షట్టర్ల మరమ్మతులకు నిధుల్లేవ్.. కాలువల వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు దెబ్బతిన్నాయి. ఈ వేసవిలో ఆధునికీకరణ పనులకు రూ.60 లక్షలు ప్రతిపాదనలు పంపించారు. స్లూయిజ్ మరమ్మతులకు రూ.4.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. లాకుల నిర్వహణకు నిధులివ్వాల్సి ఉంది.



కాకినాడలో సమావేశమైన వైసీపీ ముఖ్య నేతలు

పోస్టుమార్టం!

- పార్టీ ఓటమిపై వైసీపీలో విస్తృత చర్చ
- కాకినాడలో సమావేశమైన ఉభయగోదావరి జిల్లాల పార్టీ ప్రతినిధులు, ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు
- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఆందోళనకు ప్రణాళిక

కాకినాడ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ.. తమ ఐదేళ్ల పాలనలో ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసింది. ముఖ్యంగా ఆ పార్టీ నేతలు చేసిన అన్యాయాలు, అక్రమాలు, అవినీతి బాగోతాలు అన్నీ ఇన్నీ కావు. డీబీటీ పద్ధతిలో ప్రజలకు అనేక పథకాల పేరుతో వారి ఖాతాల్లో డబ్బులు వేసినా.. అభివృద్ధిని మాత్రం పూర్తిగా పక్కన పెట్టేసింది ఆ ప్రభుత్వం. అంతేకాదు ఆ పార్టీ నేతల నోటి దురుసు, దందాలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. మరోసారి ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. అంతే సంగతులు అని భావించిన రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని అధికార పీఠం నుంచి కిందకు దించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 21 సీట్లలో ఒక్కటి కూడా గెలవలేదు. ఈ నేపథ్యంలో గురువారం కాకినాడలోని డీ కన్వెన్షన్ హాలులో ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఉభయగోదావరి జిల్లాల పార్టీ నేతలతో సమావేశమయ్యారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, కురసాల కన్నబాబు, పినిపే విశ్వరూప్, మాజీ ఎంపీ వంగా గీత తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో తాము ఎందుకు ఓడిపోయాం అనే విషయంపై చర్చించుకున్నారు. అలాగే ఈవీఎం వల్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందంటూ బొత్స వ్యాఖ్యానించడం విశేషం. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో ఏమేమి చేసింది, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిందా? లేదా? అనే విషయాలపై చర్చించారు. ముఖ్యంగా ఇతర జిల్లాలో రెడ్ బుక్ సంస్కృతి నడుస్తున్నందున.. అదే ఇక్కడ కూడా త్వరలో అమలుచేసే అవకాశం ఉందన్న విషయంపైనా చర్చించినట్టు తెలిసింది. అలాగే ఈ ఏడాదిలో ప్రభుత్వం ఏయే హామీలను అమలు చేసింది? ఏం చేయలేదు? అనే విషయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలని చర్చించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించారు. పథకాల అమలుపైనా ఆందోళనకు సిద్ధం కావాలని బొత్స పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే త్వరలోనే పార్టీ బలోపేతం దిశగా గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్టు బొత్స వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహిస్తే.. పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు.

జిల్లాలో చెరువులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు : జేసీ



కలెక్టరేట్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెరువులు, కాలువలు, డ్రెయిన్లు, వాగులు వంటివి ఆక్రమణకు గురికాకుండా, ధ్వంసం కాకుండా కాపాడాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా అధికారులను ఆదేశించారు. నీటి నిల్వ చేసే కాలువల సంరక్షణపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వాచ్ డాగ్ కమిటీ తొలి సమావేశం కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆక్రమణలు, దుర్వినియోగం వల్ల జలవనరులు అంతరించి దుష్పరిణామాలకు దారితీయకుండా నివారించేందుకు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్, కాలుష్య నియంత్రణ శాఖల అధికారులు సభ్యులుగా జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో వాచ్‌డాగ్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా రికార్డుల్లో నమోదైన చెరువులు, కుంటలు, వాగులు, కాలువలు, డ్రెయిన్ల వంటి నీటి నిల్వ కేంద్రాలను పరిశీలించి ఇప్పటికే ఆక్రమణకు గురైతే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, చెరువుల గట్లను డంపింగ్ యార్డులుగా వినియోగించవద్దన్నారు. కాలువలను ధ్వంసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వాటర్ బాడీస్ ఆక్రమణకు సంబంధించి కోర్టు వివాదాలకు సత్వర పరిష్కారం చేయాలన్నారు. జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని ప్రతినెలా నిర్వహిస్తామన్నారు. వచ్చేనెల సమావేశానికి కాలువలు, చెరువులు ఆక్రమణల విస్తీర్ణంలో ఉన్న పంటల సాగు, సివిల్ నిర్మాణాల వివరాలు తేవాలని, ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో వెంకట్రావు, మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు, డీపీవో రవికు మార్, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో 11 మంది వైద్యాధికారుల నియామకం

జీజీహెచ్(కాకినాడ), మే16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు పీహెచ్‌సీల్లో కొత్తగా 11 మంది వైద్యాధికారుల నియామకం చేపట్టినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో వైద్యాధికారుల నియామకాల్లో భాగంగా సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు ఈనెల 6 నుంచి 7వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. 11 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చామని చెప్పారు. వారు.. డాక్టర్ కె.అయేషా (కాత్రావులపల్లి పీ హెచ్‌సీ), డాక్టర్ మురళి (రాజపూడి), డాక్టర్ ఎస్.సాయిరామ్‌కుమార్ (సంపర), డాక్టర్ మెహర్ ప్రత్యూష (సంపర), డాక్టర్ సాయి రామ్‌కుమార్ (శాంతి ఆశ్రమం), డాక్టర్ కె.రోజాప్రియ (మల్లాం), డాక్టర్ వి.రోజా (వేట్లపాలెం), డాక్టర్ ఎం.జయేష్‌కుమార్ (పీపీ యూనిట్, పెద్దాపురం), డాక్టర్ రవికుమార్ (యూఎఫ్‌డబ్ల్యూసీ, కొండయ్యపాలెం-కాకినాడ), డాక్టర్ అఫ్రోజ్ (కరప), డాక్టర్ ఎం.భరత్ (టీహెచ్ వార్డు, కాకినాడ).



విపత్తులను ఎదుర్కొందాం

కాకినాడలో మాక్ డ్రిల్

7

ఐదేళ్లు పూర్తయిన 85 సిబ్బందికి బదిలీలు



పోలీసు సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

కాకినాడక్రైం, మే16 (ఆంధ్రజ్యోతి): ఒకే పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బందికి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టినట్టు ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. ఐదేళ్లు పూర్తయిన 19 మంది ఏఎస్‌ఐలు, 43 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 23 మంది కానిస్టేబుళ్లకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కౌన్సెలింగ్ చేపట్టారు. ఖాళీగా ఉన్న పోలీస్‌స్టేషన్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడించారు. సిటీ పరిధిలో పనిచేసిన వారిని గ్రామీణ ప్రాంతాలకు, గ్రామీణ స్టేషన్లలో పని చేసిన సిబ్బందిని సిటీకి బదిలీ చేసి సమతుల్యతకు పెద్దపీట వేశారు. ఏఎస్పీ (అడ్మిన్) ఎంజేవీ భాస్కరరావు, పరిపాలనాధికారి ఎంవీవీఎస్ఎన్ మూర్తి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డెంగ్యూపై అవగాహన కల్పించాలి : డీఎంహెచ్‌వో

జీజీహెచ్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల కారణంగా విజృంభించే డెంగ్యూపై విస్తృతంగా అవగాహన కల్పించి డెంగ్యూ రహిత సమాజం కోసం కృషిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె. నరసింహనాయక్ పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ అవగాహన దినం సందర్భంగా శుక్రవారం కాకినాడ స్మార్ట్ సిటీ హాల్లో ఆరోగ్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగ్యూను ఓడించండి, పరిశీలించండి, శుభ్రంచేయండి, మూతలు పెట్టండి అనే నినాదాన్ని జిల్లావ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారుల ద్వారా ప్రజలకు చేరవేయాలన్నారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ విల్సన్ లు మాట్లాడుతూ దోమల ఆవాసాలు గుర్తించి తగిన నివారణ చర్యలు తీసుకోవాలని సబ్‌యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



ఒత్తిడి నియంత్రణే మార్గం!

నేడు హైపర్‌టెన్షన్ డే

రక్తపోటు నియంత్రణతోనే మనిషికి ఆరోగ్యం
నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు
జీవనశైలిలో మార్పులే కీలకం

ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలలో అధిక రక్తపోటు ఒకటి. ధమనుల గోడలపై రక్త ప్రసరణ వేగం సాధారణంగా ఉండాల్సిన దానికంటే అధికంగా ఉండటాన్ని వైద్య పరిభాషలో హైపర్‌టెన్షన్ అంటారు. ఇదే హై బ్లడ్ ప్రెజర్ (హైబీపీ)కి కారణమవుతుంది. జీవన శైలి, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, ఆందోళన తదితర కారణాలతో వచ్చే బీపీ విషయంలో నిర్లక్ష్యం చేస్తే గుండెపోటు వచ్చి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. చాలా మంది బీపీని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నేడు వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

(అంబాజీపేట- ఆంధ్రజ్యోతి)

ప్రతి వ్యక్తికి తమదైన జీవనశైలి ఉంటుంది. ఎవరి ఆహారపు అలవాట్లు వారికుంటాయి. దైనందిన జీవితంలో ఆటుపోట్లు ఎవరికైనా ఆటుపోట్లు తప్పవు. ఈ క్రమంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి.. ఆయా వ్యక్తులపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా ఆరోగ్యంపై చూపే ప్రభావం తదనంతర పరిణామాలకు కారణమవుతుంది. హైబీపీ వంటి అనారోగ్య పరిస్థితులకు హేతువవుతుంది. చివరిగా ప్రాణాంతక పరిస్థితులకు దారితీసే గుండెపోటుకూ దారితీస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లక్షలాది మంది రక్తపోటు(హైబీపీ)తో బాధపడుతున్నట్లుగణాంకాలు చెబుతున్నాయి. ఒక్క డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సుమారు 15 లక్షల మంది జనాభా ఉండగా, సుమారు మూడు లక్షల మంది వరకూ రక్తపోటుతో బాధపడుతున్నట్లు అంచనా. ప్రభుత్వం ఆదేశాల మేరకు కోనసీమ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటివరకూ 90,225 మంది నమోదుకాగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సుమారు రెండు లక్షల మందికిపైగా రక్తపోటు నియంత్రించేందుకు మందులు వాడుతున్నట్టు అంచనా. ప్రతి నెల సచివాలయాల్లో 104 సిబ్బంది ద్వారా ఆయా గ్రామాల్లోని కొంతమంది బీపీ చెక్ చేయించుకుని ప్రభుత్వం అందిస్తున్న మందులను వాడుతున్నారు.

అధిక ఒత్తిడితో రక్తపోటు..

మారిన జీవన పరిస్థితుల నేపథ్యంలో ఉద్యోగులు, వ్యాపారస్తులు నిత్యం చేసే పనుల్లో తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ప్రైవేట్ ఉద్యోగులు తమ లక్ష్యాలను సాధించేందుకు అదనంగా కష్టపడుతున్నారు. ఈ క్రమంలో సరైన నిద్రలేకపోవడంతోపాటు పని ఒత్తిడితోనే జీవనం సాగిస్తున్నారు. శారీరక శ్రమ లేకపోవడం, స్థూలకాయం, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, నిద్రలేమి ఇవన్నీ కూడా హైబీపీకి కారణాలుగా మారాయి. అధిక ఉప్పుతో కూడిన కల్తీ ఆహార పదార్థాలు తీసుకోవడం మరో కారణం.

రక్తపోటు లక్షణాలు ఇలా..

అధిక బీపీ ఉన్నవారికి తీవ్రమైన తలనొప్పి వస్తుంది. పనిలో అలసట, వికారం, వాంతులు, తల తిరగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక రక్తపోటు ఉండే వారికి కంటిచూపు దెబ్బతినే ప్రమాదం ఉంది. ఛాతిలో నొప్పి వచ్చి గుండెపోటుకు గురయ్యే అవకాశాలు చాలా ఎక్కువే. కొద్దిమందిలో ముక్కు నుంచి రక్తం కారుతుంది. నిద్రలో అతిగా గురక వస్తే హైబీపీకి కారణంగా చెప్పవచ్చు. రాత్రివేళ తరచూ తలనొప్పి రావడం ఒక లక్షణం.



అంబాజీపేటలో బీపీ చెక్ చేస్తున్న వైద్యుడు శ్రీనివాస్

బీపీని కంట్రోల్ చేసేందుకు..

రోజూ శరీరానికి తగిన విధంగా వ్యాయామం చేయాలి. కొవ్వు పదార్థాలు ఎక్కువగా వినియోగించకూడదు. మద్యం, సిగరెట్ తాగే అలవాట్లు ఉండే మానుకోవాలి. ఆహారంలో ఉప్పు రోజుకి 5 గ్రాములు కన్నా ఎక్కువగా తీసుకోరాదు. అధిక బరువు లేకుండా చూసుకోవాలి. 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కనీసం నెలకొకసారి బీపీని చెక్ చేయించుకోవాలి. ముఖ్యంగా జీవన శైలిలో ఒత్తిడిని అధిగమించే మార్పులు చేసుకుంటూ ముందుకెళ్లాలి.

అప్రమత్తత అవసరం..



అధిక రక్తపోటు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. బీపీని నియంత్రణలో ఉంచుకుంటే మనిషి ఆరోగ్యానికి ఇబ్బంది ఉండదు. అలా కాకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం. సరైన వ్యాయామం, ప్రశాంతమైన జీవన శైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి. అదేవిధంగా ఆహారపు అలవాట్ల విషయంలో నియంత్రణ ఉండాలి. అలాగే బీపీ ఉన్న వారు వైద్యులతో తరచు చెక్ చేయించుకోవడం తప్పనిసరి.

- డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బెండమూర్లంక

అందమే పుష్పాలు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి లోని నల్లావారిపేటలో విశ్రాంత బీఎస్ ఎన్ఎల్ ఉద్యోగి గంటి సత్యనారాయణ పెరట్లో మే పుష్పాలు వికసించాయి. ఇవి చుట్టుపక్కల వారిని విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

ముమ్మిడివరం (ఆంధ్రజ్యోతి)

సర్టిఫికెట్ ధ్రువీకరణ చేయించుకోండి

కార్పొరేషన్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-2026 సంవత్సరానికి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దగ్గరలోని ఏదైనా ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ లేదా జిల్లా ఉపాధి కార్యాలయం, అమలాపురంలో ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదుపత్రంతో ఈనెల 26న సర్టిఫికేషన్ వెరిఫికేషన్ చేయించుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు.సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకోని అభ్యర్థులు కౌన్సిలింగ్‌కు అర్హులుకారని తెలిపారు. 555మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారని వీరిలో 118 దరఖాస్తుదారులు మాత్రమే పరిశీలన చేయించుకున్నారన్నారు. మిగిలిన 437 కూడా దరఖాస్తులు పరిశీలన చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08842348182, 9440408182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి ఈనెల 24తో గడువు ముగుస్తుందని ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మ పేర్కొన్నారు.

114 ఏళ్ల నాటి వృక్షాలు..

త్వరలో చరిత్రలోకి

» అప్పట్లో కింగ్ జార్జి నాటిన మొక్కలు » గత వైభవ కమ్మని కావ్యంలోని..
» అపురూపాలు ఒక్కొక్కటిగా చరిత్ర కాగితాల్లోకి



చరిత్రను కాపాడుకోవాల్సిందే.. కాలంలో కలసిపోతే తిరిగి తీసుకురావడం అసాధ్యం. ఈ విషయాన్ని గుర్తెరగని వారు చారిత్రక ఆనవాళ్లను చులకనగా చూస్తుంటారు. ఒక ప్రదేశం గత వైభవానికి చారిత్రక ఆనవాళ్లే ప్రతీక. ఈ రుజువులను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉంటుంది. ఇదంతా ఎందుకంటే.. రాజమహేంద్రవరం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ప్రదేశం. గ్రామంగా ఆరంభమై ఎన్నో మైలురాళ్లు దాటుకొని, మరెన్నో కలికితురాయిరాళ్లను తన కీర్తి కిరీటంలో ఇముడ్చుకొంది. ఎందరో రాజులు, మరెందరో కవులు, మహానుభావులు కదలాడిన నేల నేటికీ సాంస్కృతిక రాజధానిగా విలసిల్లుతోంది. అందుకే గత వైభవ కీర్తులతో కమ్మని కావ్యమని కీర్తించారో కవి. ఆ కావ్యానికి చారిత్రక ఆనవాళ్లే ఆయువు పట్టు. ఆలాంటివి అభివృద్ధిలో ఒక్కొక్కటిగా కలిసిపోయి కనుమరుగవుతున్నాయి. రాజమహేంద్రవరాన్ని రాజరాజ నరేంద్రులు పాలించాడు. అప్పట్లో పెద్ద పెద్ద ప్రాకారాలతో కోట ఉండేది. ఆ కోటకు సంబంధించిన కందకం పేరుతోనే ప్రస్తుతం కందకం రోడ్డు అని పిలుస్తున్న ప్రాంతం ఉంది. ఆ కందకం అవశేషాన్ని రైల్వే బ్రిడ్జి నిర్మాణం సమయంలో తొలగించారు. ఇప్పుడు మనం కంబాల చెరువు-లాలాచెరువు రోడ్డును సెంట్రల్ జైలు రోడ్డు అంటున్నాం. కానీ అది ఒకప్పుడు గ్రాండ్ ట్రంక్ (జీఎన్‌టీ) రోడ్డు. నేషనల్ హైవేలు.. అసలు రహదారులే సరిగా లేని రోజుల్లో లాలాచెరువు వైపు నుంచి నేరుగా లాంచీల రేవుకు ఈ రహదారి ఉండేది. ఆ రోజుల్లో అంటే పట్టణంగా పరిణతి చెందక ముందు ఈ రహదారే ప్రధాన రవాణా మార్గం. రాజులు, జమిందారులు, బ్రిటిషర్లు.. ఇలా ఎవరు రాజమహేంద్రవరం రావాలన్నా అటు నుంచి గోదావరిని దాటాల్సిందే. అలా వచ్చిన తర్వాత టాంగాలో జీఎన్‌టీ రోడ్డు గుండా వెళ్లేవారు. కానీ జీఎన్‌టీ రోడ్డు పోస్టాఫీసు, వై.జంక్షన్‌లో ఓ రెండేళ్ల కిందట లైటింగ్‌తో ఏర్పాటుచేసిన బోర్డు తప్ప గత వైభవ ఆనవాళ్లేమీ కనిపించవు. ఇప్పుడు మనం చెప్పుకుంటున్న పుష్కరాల రేవు ఒకప్పటి పుష్పగిరి. ఇక్కడ ఉన్న గుట్టకు ఆ పేరు ఉండేది. ఇక్కడే బౌద్ధ చిహ్నాలు కూడా ఉన్నాయి. వాటిని ధ్వంసానికే వదిలేశారు. చివరిగా రికార్డు అయిన సతీసహగమనానికి రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్ మౌనసాక్షి. దానికి సంబంధించిన సమాధిని పుష్కరఘాట్ సమీపంలోని వాటర్ వర్క్స్ ఎదురుగా చూడొచ్చు. తుప్పలతో నిండిన ఆ సమాధి దుస్థితిని ఒకప్పుడు 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకురాగా పునరుద్ధరించారు. ఇలా చెప్పుకుంటూపోతే రాజమహేంద్రవరం చరిత్రకు సంబంధించిన ఎన్నో ఎంతో అపురూపమైన అవశేషాలు, రుజువులు చరిత్ర కాగితాల్లోకి ఎక్కేశాయి. ఇప్పుడు సెంట్రల్ జైలు రోడ్డులోని పచ్చటి మర్రి చెట్లు కూడా త్వరలోనే కనుమరుగు కానున్నాయని తెలుస్తోంది. రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా వీటిని తొలగించే ఆలోచన చేస్తున్నారు. వందల ఏళ్ల కిందట కాదు.. ఓ 20 ఏళ్ల కిందట ఈ రహదారిలో వెళుతుంటే ఆ చెట్లు పచ్చని పరదా పరచినట్టుగా ఉండేవి. ఓ చిట్టడవిని తలపిస్తూ ఎంతో నీడనిచ్చేవి. ఈ చెట్లకు సుమారు 115 ఏళ్ల చరిత్ర ఉంది. ఇప్పటి సెంట్రల్ జైలు ఒకప్పటి ఫ్రెంచి పాలకుల గుర్రపుశాల. తర్వాత కాలక్రమేణా దీనిని బ్రిటిషర్లు జైలుగా మార్చారు. అలా ఇప్పుడు చూస్తున్న రూపు సంతరించుకొంది. గత పుష్కరాలకు మార్పులు చేసే వరకూ ఆనాటి పెద్ద జైలు తలుపు ఉండేది. తర్వాత అదీ కనుమరుగైంది. మనం బ్రిటిషర్ల పాలనలో ఉండే సమయంలో భారతదేశ ఐదో బ్రిటిష్ చక్రవర్తిగా జార్జ్ ఫ్రెడరిక్ ఎర్నెస్ట్ ఆల్బర్ట్(కింగ్ జార్జ్) 1910లో బాధ్యతలు చేపట్టాడు. తర్వాత ఆయన 1911 డిసెంబరు 12న జైలు సందర్శనకు ఇక్కడికి వచ్చాడు. రాకకు గుర్తుగా ఈ చెట్లను నాటారని ఆనాటి శిలాఫలకం ద్వారా తెలుస్తోంది. ఆ శిలాఫలకం గత పుష్కరాల ముందు వరకూ ఉండేదని చెబుతారు. తర్వాత కాలగర్భంలో కలిసిపోయింది. ఈ చెట్లు కూడా కాలగర్భంలో కలిసిపోతే రాజమహేంద్రవరం చారిత్రక సజీవ అవశేషాలు దాదాపుగా కనుమరుగైపోయినట్టే. అదే జరిగితే ఆనాటి వైభవాన్ని పిల్లలకు మాటల్లో చెప్పి పుస్తకాల్లో చూపించడం తప్ప రుజువును కళ్ల ముందుకు తీసుకురావడం అసాధ్యం.

- రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



సెంట్రల్ జైల్ రోడ్డులో వందేళ్లకు పైబడిన మహా వృక్షాలు



సెంట్రల్ జైల్లో బ్రిటిష్ భారతదేశపు చక్రవర్తి కింగ్‌జార్జ్ 5 నాటిన వృక్షానికి సంబంధించిన శిలాఫలకం

స్త్రీశక్తితో సమాజ పురోగతి

సేవికా సమితి రాష్ట్ర కార్యవాహిక ఉజ్వల.. మహిళ పథ సంచలన ర్యాలీ



రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్న మహిళ పథ సంచలన ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, మే 16(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి కుటుంబానికి, దేశానికి స్ఫూర్తిదాయకమని, స్త్రీ శక్తి మేల్కొంటే సమాజం పురోగతి చెందుతుందని సేవికా సమితి రాష్ట్ర కార్యవాహిక ఉజ్వల అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణే ప్రధానంగా సేవికా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళ పథ సంచలన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు నుంచి మొదలైన ఈ ర్యాలీ వై-జంక్షన్‌లోని అబ్దుల్ కలామ్ విగ్రహం మీదుగా జాంపేటలోని గాంధీ బొమ్మ నుంచి తిరిగి ప్రకాష్‌నగర్‌కు చేరింది. ఈ సందర్భంగా ఉజ్వల మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా శక్తివంతమైన సమాజ నిర్మాణ కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అఖిల భారత సంచాలిక శాంతక్క, ఆంధ్ర ప్రాంత కార్యవాహిక వెంకటభాను, మహిళలు, సమితి కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామోత్సవాలకు కాంస్య రథం వితరణ

రూ.8లక్షల వ్యయంతో సమకూర్చిన దొరబాబు సుమ దంపతులు



కాంస్య రథాన్ని అందజేస్తున్న దొరబాబు సుమ దంపతులు

అనపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు గ్రామంలో వేంచేసియున్న పలు ఆలయాలలో ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవాలు నిర్వహించేందుకు వీలుగా గ్రామానికి చెందిన సత్తి వీరవెంకట సత్యనారాయణ రెడ్డి(దొరబాబు) సుమ దంపతులు రూ.8 లక్షల వ్యయంతో సమకూర్చిన కాంస్య రథాన్ని శుక్రవారం గ్రామంలోని దేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ తన తండ్రి సత్తి సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం తమ కుటుంబ సభ్యులు ఈ రథాన్ని బహూకరించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన కాంస్య రథంలో ఊరేగించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో స్వామి వారి దివ్యకల్యాణోత్సవాలు సందర్భంగా నిలుపుదల చేసిన ఆర్జితసేవలు పునః ప్రారంభం అయ్యాయి. దీనిలో భాగంగా శుక్రవారం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో చండీ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. అమ్మ వారికి చండీ, సప్తసతి పారాయణాలు, మూలమంత్ర జపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, చైర్మన్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ఆర్జితసేవలు పునఃప్రారంభం

శృంగేరీ పీఠాధిపతుల సలహాలతోనే..

అన్నవరం దేవస్థానంలో ఉత్సవాల సమయంలో పలు ఆర్జితసేవలు నిలుపుదల విషయంలో గందరగోళ పరిస్థితులు తలెత్తుతున్నాయి. వైదిక కమిటీ కూడా ఒక్కోసారి ఒక్కో నిర్ణయాన్ని వెళ్లబుచ్చుతున్నారు. ఇప్పటివరకు కల్యాణోత్సవాల సమయంలో వనదుర్గ ఆలయంలో చండీప్రత్యంగిర హోమాలు ఎప్పుడు నిలుపుదల చేయలేదు. ఈ ఏడాది నిలుపుదల చేయగా అవి వివాదాస్పదమయ్యాయి. దీంతో సరైన ప్రణాళికలతో శృంగేరీ పీఠాధిపతుల సలహా తీసుకుని దానిని ప్రామాణికంగా బావించి ప్రతీఏటా వారి సూచనను అమలు చేయాలని చైర్మన్ రోహిత్, ఈవో సుబ్బారావు వైదిక కమిటీకి సూచించారు.

పొలమూరు హెల్త్ క్లినిక్‌లో తనిఖీలు

» 'కాలం చెల్లిన మందులు' వార్తలపై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ
» బాధ్యులపై చర్యలు తప్పవు: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కోమలి



కాలం చెల్లిన మందులను పరిశీలిస్తున్న డాక్టర్ కోమలి

అనపర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరు గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కాలం చెల్లిన మందులపై మీడియాలో వచ్చిన కథనాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ కోమలి, డీపీఎంవో డాక్టర్ శ్రీవల్లి తదితరులు హెల్త్ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన మందులను గుర్తించారు. ఈ సందర్భంగా క్లినిక్‌లో ఉన్న కాలం చెల్లిన మందుల వివరాలను నమోదు చేసుకుని సిబ్బందిని విచారించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోమలి మాట్లాడుతూ మీడియాలో వచ్చిన కథనాలతో డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామని, తనిఖీల్లో కాలం చెల్లిన మందులను గుర్తించామన్నారు. ఎప్పటికప్పుడు సిబ్బందికి సూచనలు చేస్తున్నప్పటికీ కొన్ని చోట్ల బాధ్యతారాహిత్యం కనబడుతోందన్నారు. జిల్లాలో మిగిలిన చోట్ల కూడా పరిస్థితులపై ఆరా తీస్తున్నామని బాధ్యులపై చర్యలు తప్పవని ఆమె అన్నారు. పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అన్నారు. ఈ తనిఖీల్లో కుతుకులూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం



ఉగ్రవాదులకు, పాకిస్తాన్‌కు ఆపరేషన్ సిందూర్ ద్వారా గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా శుక్రవారం సాయంత్రం కాకినాడ నగరంలో నిర్వహించిన తిరంగ్ ర్యాలీ విజయవంతమైంది. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అధ్వర్యంలో చేపట్టిన ఈ ర్యాలీ మెయిన్‌రోడ్‌లోని టుటౌన్ సెంటర్ నుంచి బయలుదేరిన ఈ ర్యాలీ బాలాజీ చెరువు సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అతిదులుగా పాల్గొన్నారు.

-కాకినాడ సిటీ

పుష్పాల కనువిందు

అంబాజీపేట, మే 16(ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో ఆహ్లాదంగా ఉండే పచ్చని చెట్ల మధ్య పసుపు, ఎరుపు రంగుల పుష్పాలతో చెట్లు కనువిందు చేస్తున్నాయి. అంబాజీపేట మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఎర్రటి పువ్వులు, పసుపు రంగు(రేలా పుష్పాలతో ఉన్న చెట్లు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు ఈచెట్ల అందాలను చూడాల్సిందే.





విపత్తులను ఎదుర్కొందాం


కాకినాడలో మాక్ డ్రిల్ దృశ్యాలు

కాకినాడలో మాక్ డ్రిల్

ప్రమాద పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపించిన అధికారులు

కలెక్టరేట్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): అనుకోని విపత్తులు సంభ వించినప్పుడు ఎదుర్కొనేందుకు ఉద్యోగులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, వైద్య-ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. సహాయక చర్యల్లో భాగంగా మెట్లు, నిచ్చెనల ద్వారా గాయపడిన వారిని తీసుకువచ్చి తాత్కాలిక వైద్య శిబిరంలో ప్రథమ చికిత్స అందించి వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీపీఆర్, అత్యవసర వైద్యం అందించడంపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్ పై అంతస్తులో అగ్ని ప్రమాదం సంభవించినట్టు చూపించి నిచ్చెన ఆసరాగా భవనం పైకి విపత్తు స్పందన సిబ్బంది చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్న వారిని కిందికి తీసుకొచ్చి వైద్య సహాయం అందించేందుకు 108 వాహనాల ద్వారా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాలను కళ్లకు కట్టినట్టు చూపించారు. వీటిని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా స్వయంగా పర్యవేక్షించారు. కలెక్టరేట్ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ రూమ్ భవనంలో కొంత భాగం కూలినట్టు చూపించి అందులో చిక్కుకున్న వారిని ఎలా కాపాడాలో వివరించారు. భవనం కూలిపోయిన తర్వాత అందులో ఎంత మంది చిక్కుకున్నారో తెలుసుకునేందుకు కెమెరాలు వినియోగించారు. చిక్కుకున్న వారిని శబ్దాల ద్వారా గ్రహించి రక్షించేందుకు గోడను కట్టర్ల ద్వారా కట్ చేసి దాని ద్వారా భవనంలోకి ప్రవేశించి లోపల ఉన్నవారిని స్ట్రెచర్లపై తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న వారికి సీపీఆర్ చేసి అంబులెన్స్‌ల్లో ఆసుపత్రికి తరలించారు.


మాక్ డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న జేసీ రాహుల్ మీనా

మాక్ డ్రిల్స్‌తో ప్రజల అప్రమత్తం : జేసీ

ఈ సందర్భంగా జేసీ రాహుల్ మీనా మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాలను ఎదుర్కోవడంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు మాక్ డ్రిల్స్ ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, 3వ బెటాలియన్ ఎస్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ మోహన్‌రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ రాజేష్, డీఈవోసీ నోడల్ అధికారి భారతి, సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ నాగార్జున, డీపీవో రవికుమార్, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కిలేడీలు అన్నవరంలో దొరికారు!

- బస్సుల్లో ప్రయాణికుల ఆభరణాలు దొంగిలిస్తున్న అత్తాకోడళ్ల అరెస్టు
- 60 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షల నగదు స్వాధీనం

అన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ కిలేడీలు. దొంగతనానికి నిర్ణయించుకున్నారంటే ఎంతదూరమైనా ప్రయాణిస్తారు. ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లలో ప్రయాణికుల ఆభరణాలు, నగదు తస్కరించడమే లక్ష్యంగా పెట్టుకుని చాకచక్యంగా ప్రయాణికులతో మాటలు కలిపి దృష్టిమరలిచి నగదు, ఆభరణాలు తీసుకుపోతుంటారు. అలాంటి అత్తాకోడళ్లను కాకినాడ జిల్లా అన్నవరంలో పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే విజయవాడ రామవరప్పాడుకు చెందిన నక్కా వెంకటలక్ష్మి (21), నక్కా మంగ (45) అత్తాకోడళ్లు. వీరు రద్దీగా ఉండే బస్సుల వద్ద ప్రయాణికుల ఆభరణాలు, బ్యాగ్‌లలో నగదుపై కన్నేసి వారితో మాటలు కలిపి దృష్టి మరల్చి తస్కరించి వెంటనే దిగిపోతారు. దీంతో వారిపై నిఘాపెట్టిన పోలీసులు అన్నవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అరెస్టు చేసి 60 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు తెలిపారు. వీరు అన్నవరం, ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల్లో నిందుతులని తెలిపారు. రిమాండ్‌కు ప్రత్తిపాడు కోర్టుకు తరలించామన్నారు. సమావేశంలో అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తదితరులున్నారు.


నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలతో ప్రత్తిపాడు సీఐ

తాళం వేసిన ఇళ్లల్లో దొంగతనాలు

- ఇద్దరి అరెస్ట్
- రూ.11లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం


రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాజోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు పోలీసుస్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరినీ రాజోలు పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ ఈ వివరాలను తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా కోడూరుకు చెందిన బోరాబత్తుల ఆంజనేయులు, తణుకుకు చెందిన వడ్లపాటి విజయ్‌జోషి గత 4 నెలల నుంచి రాజోలు, తాటిపాక మఠం, పొన్నమండ, శివకోడు, ఆత్రేయపురం గ్రామాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. శివకోడు బైపాస్ రోడ్డులో బస్‌స్టేషన్ వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.11లక్షల విలువచేసే 112 గ్రాముల బంగారం, రెండు కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మెకానిక్ మృతి


మృతిచెందిన నాగరాజు


ఫైల్‌ఫొటో

కొవ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని మెకానిక్ మృతి చెందినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణానికి చెందిన పత్తిగుళ్ళ నాగరాజు హోండా షోరూంలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 15వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయటకు వస్తుండగా కొవ్వూరు డిపోకు చెందిన బస్సు ఏలూరు నుంచి తిరిగి వస్తూ ఢీకొని నాగరాజు పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్ర రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఫోన్‌నెంబరు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య దేవి, కుమారుడు సాయిరామ్, కుమార్తె యమున స్వప్నమాధురి ఉన్నారు. అతడికి కు మారుడు అందించిన ఫిర్యాదుపై ఏఎస్‌ఐ జి.ప్రకాష్ కేసు నమోదుచేసినట్టు సీఐ తెలిపారు.

రెండు లారీలు ఢీ

దేవరపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఇనుప ఊచలతో నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ వేగంగా ఢీకొనడంతో క్యాబిన్‌లోకి ఊచలు దూసుకెళ్లాయి. ఈ ఘటన శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారులో జరిగింది. రాజమండ్రి వైపు నుంచి దేవరపల్లి వైపు వస్తున్న ఐరన్ ఊచల లారీ రిపేరు రావడంతో నిలిచిపోయింది. రాజమండ్రి వైపు వస్తున్న మరో లారీ ఎదురుగా ఉన్న లారీని ఢీకొనడంతో క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గాయపడిన క్లీనర్‌ను గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.


క్యాబిన్‌లోకి దూసుకెళ్లిన ఇనుప ఊచలు

పుట్టినరోజు వేడుకకు వచ్చి...

గోదావరిలో యువకుడు గల్లంతు


జగపతిబాబు (ఫైల్)

ఆత్రేయపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): గౌతమి గోదావరి నదిలో ప్రమాదవశాత్తు యువకుడు గల్లంతయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరానికి చెందిన తలపాకుల జగపతిబాబు(జోని) (20) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం ఉల్లిపేటలో తన మేనమేమ కుమారుడు పుట్టినరోజు వేడుకకు శుక్రవారం వచ్చాడు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో గౌతమి నది తీరానికి బహిర్భూమికి వచ్చి ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో గల్లంతయ్యాడు. స్థానికులు గోదావరిలో పడవల ద్వారా గాలింపు చర్యలు చేపట్టినా ఎంతకీ ఆచూకీ లభ్యంకాలేదు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జగపతిబాబు మేనేమామ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.రాము తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి


మరణించిన శ్రీను

ఆలమూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ ఏటి గట్టు వద్ద అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందాడు. ఆలమూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రావులపాలెం గ్రామానికి చెందిన కుడిపూడి శ్రీను (39) జొన్నాడ గోదావరి ఒడ్డున మృతిచెంది ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీను తండ్రి సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఏఎస్‌ఐ సూర్యచంద్రరావు తెలిపారు. మృతదేహం వద్ద వివరాలు సేకరించి శవపరీక్ష నిమిత్తం ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

డివైడర్‌ను ఢీకొని గాయాలు


గాయాలపాలైన పవన్

గండేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారున బొర్రంపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో కిర్లంపూడి మండలం శ్రీరంగపట్నంకు చెందిన పవన్ తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల ప్రకారం.. పవన్ తన స్నేహితుడు ప్రసాద్‌తో కలిసి కొత్త మోటార్‌బైక్ కొనుగోలు చేసేందుకు రాజమండ్రి వెళ్లి కొనుక్కుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. కొత్త వాహనాన్ని పవన్ డ్రైవ్ చేస్తుండగా బొర్రంపాలెం వద్ద బైక్ డివైడర్‌ను ఢీన్నాడు. దీంతో పవన్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం జగ్గంపేట ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

బైక్‌ల దొంగ అరెస్టు

జగ్గంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ల దొంగను జగ్గంపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గంగవరం మండలం రామదేవపురం గ్రామానికి ఎస్.రామకృష్ణ కొంతకాలంగా మోటారుసైకిళ్ల దొంగతనం చేస్తున్నాడు. అతడిని పోలీసులు అరెస్టు చేసి 5 మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది.

భక్తుల సౌకర్యాల కల్పనలో

అలసత్వం ప్రదర్శించొద్దు

- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై తీవ్రమైన చర్యలు
- అన్నవరం దేవస్థానం ఈవో

అన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): సుదూర ప్రాంతాల నుంచి సత్యదేవుడి దర్శనానికి విచ్చేసే భక్తుల సౌకర్యాల కల్పన, వారి సందేహాలను నివృత్తి చేయడంలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించవద్దని అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు ఆదేశించారు. శుక్రవారం దేవస్థానం ఏఈవోలు, సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ప్రధానంగా గురువారం దేవదాయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సమీక్షలో ప్రధాన దేవాలయాల ఈవోలు పాల్గొనగా వాటి విషయాలను శుక్రవారం ఈవో వివరించారు. సింహాచలం దేవస్థానంలో జరిగిన ఘటన అక్కడ ప్రస్తావనకు వచ్చిందని, కేవలం రూ.2.50 లక్షల పనుల్లో నాణ్యతలేమితో పలువురు ప్రాణాలు కోల్పోయారని ఇది నిర్లక్ష్యంతో జరిగినదని రిపోర్టులో పేర్కొన్నారని, ఈ విషయంలో అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ప్రతీ పనిలో స్వీయ పర్యవేక్షణ చేయడంతో పాటు నాణ్యత విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం దేవదాయశాఖ మీద దృష్టిసారించిన నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఐవీఆర్‌ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం ప్రథమస్థానం రావడానికి ప్రతి ఒక్క ఉద్యోగి సమష్టిగా పనిచేయాలని ఈవో సుబ్బారావు సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు

ఇన్విజిలేటర్ల స్లిప్‌లు

- ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలో వెల్లడి
- చర్యలకు ఆదేశం

అన్నవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు చెప్పాల్సిన అధ్యాపకులే విద్యార్థులను పక్కదారి పట్టించారు. వివరాల్లోకి వెళితే కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఇంటర్ కళాశాలలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయి. గురువారం కళాశాలకు వచ్చిన స్క్వాడ్‌ను చూసి సంబంధిత పాఠ్యాంశాన్ని బోధించే ఒక ఇన్విజిలేటర్ అనుమానాస్పదంగా వ్యవహరించడంతో శుక్రవారం ముగ్గురు ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు నేరుగా పరీక్షహాల్‌కు చేరుకోగా ఒక ఇన్విజిలేటర్ చేతిలో స్లిప్‌లు ఉండడం, మరొక ఇన్విజిలేటర్ వారిపై దరుసుగా మాట్లాడడంతో విషయం బయటపడింది. దీంతో వారిద్దరిపై చర్యలకు ఫ్లయింగ్‌స్క్వాడ్ రిఫర్ చేశారు. ముందుగా వారిని రిలీవ్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో శనివారం ఇద్దరి ఇన్విజిలేటర్ల వివరణ తీసుకునేందుకు కాకినాడ రమ్మని, వారిపై దేవస్థానం ఈవో చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ బోర్డు కాకినాడ కన్వీనర్ ఉత్తర్వులు జారీచేశారు.

పిడుగుపాటుకు మత్స్యకారుడి మృతి


లీలాకృష్ణ (ఫైల్)

ఉప్పలగుప్తం, మే 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్పకు చెందిన కర్రి లీలాకృష్ణ (39) శుక్రవారం పిడుగుపాటుకు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లీలాకృష్ణ చెరువుల వద్దకు చేపలు వేటాడేందుకు వెళ్లిన సమయంలో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గంగాభవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు స్టేషన్ ఇన్‌చార్జి హరనాథ్ తెలిపారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టంనిర్వహించామన్నారు.

రేగడిపాలెంలో ఐదు పశువులు..

వై.రామవరం, మే 16(ఆంధ్రజ్యోతి): పిడుగు పడి ఐదు పశువులు మృత్యువాత పడిన ఘటన అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో జరిగింది. మండలంలోని కె.యర్రగొండ పంచాయతీ రేగడిపాలెం గ్రామసమీపంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురవగా పొలాల్లో మేస్తున్న పశువులు మామిడిచెట్టు కిందకు చేరగా పిడుగు పడి నాలుగు ఎడ్లు, ఒక ఆవు మృతిచెందాయి. వీటిలో రేగడిపాలెం వెదుళ్ల చంద్రారెడ్డికి చెందిన రెండు, వెదుళ్ల బుల్లబ్బాయిరెడ్డికి చెందిన ఒకటి, వెదుళ్ల లచ్చిరెడ్డికి చెందిన ఒకటి, రాకోట వెంకటరెడ్డికి సంబంధించి ఒక పశువు ఉన్నట్టు కె.యర్రగొండ సర్పంచ్ వెదుళ్ల సత్యనారాయణ పేర్కొన్నారు సుమారు రూ.3లక్షలు నష్టం ఉంటుందని, బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ సర్పంచ్ అధికారులను కోరారు.


రేగడిపాలెంలో పిడుగుపాటుకు మృతిచెందిన పశువులు

పెళ్లిలో పాటల కోసం కొట్లాట

- డీజే విషయంలో దాడికి దిగిన పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు బంధువులు
- 20మందికి గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు



దాడిలో గాయపడిన ఇరువర్గాల బంధువులు

పెద్దాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం జి.రాగంపేటలో జరిగిన ఓ వివాహ వేడుకలో పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు బంధువులు డీజే సాంగ్స్ కోసం చితకొట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే జి.రాగంపేటకు చెందిన పెళ్లి కుమారుడికి ఐ.పోలవరం మండలం గుత్తుల వేమవరం గ్రామానికి చెందిన పెళ్లి కుమార్తెకు శుక్రవారం గ్రామంలో పెళ్లి వేడుక జరిగింది. అయితే డీజే సాంగ్స్ విషయంలో ముందు ఇరువర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది. దీంతో ఇరువర్గాల మధ్య గొడవకు దారితీసింది. దీంతో రెండు వర్గాలు ఒకరికొకరు పొట్టుపొట్టుగా కొట్టుకున్నారు. ఈ పరస్పర దాడుల్లో 20మందికి గాయాలయ్యాయి. పెళ్లి బృందం వచ్చిన బస్సు అద్దాలను సైతం ధ్వంసం చేశారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో ఎస్‌ఐ మౌనిక అక్కడకు చేరుకుని వివరాలను ఆరా తీశారు. దీనిపై ఇరువర్గాల మధ్య కేసు నమోదు చేశారు.

పోశమ్మ గండి వద్ద

పెరుగుతున్న గోదావరి

దేవీపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి పోశమ్మ గండి వద్ద నీటి మట్టం పెరుగుతుంది. గత 4 రోజుల నుంచి గోదావరి పరివాహక ముంపు ప్రాంతమైన కొండ మొదలు, తాళ్లూరు నడిపూడి, గొందూరు కచ్చులూరు, మంటూరు, మూలపాడు, అగ్రహారం, దేవీపట్నం, తొయ్యేరు, పూడిపల్లి, పోశమ్మ గండి గ్రామాలకు ఆనుకుని గోదావరి ప్రవహిస్తుంది. దీంతో దండింగ్ వద్ద సీతపల్లి వాగు బ్రిడ్జ్ మునిగిపోవడంతో గండిపై ఉన్న నాలుగు గ్రామాలవారు ఇందుకూరుపేట ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చేందుకు రంపచోడవరం నుంచి గోకవరం మీదుగా ఇందుకూరుపేట రావాల్సి వస్తుంది. దీంతో ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే ందుకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు తెలిపారు. అలాగే పాపికొండల అందాలను తిలకించేదుకు ప్రకృతి ప్రేమికులు అనేక చోట్ల నుంచి వస్తున్నారు.


పోశమ్మ గండి వద్ద గోదావరి ప్రవాహం

సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు...

21 నుంచి ట్రాఫిక్ మళ్లింపు

గడ్డర్ల ఏర్పాటు నేపథ్యంలో చర్యలు

కలెక్టరేట్ (కాకినాడ), మే 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు నిర్మిస్తున్న భారత్ మాల జాతీయ రహదారి పనుల్లో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు ఏర్పాటు నేపథ్యంలో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు సామర్లకోట నుంచి కాకినాడ కలెక్టరేట్ వైపునకు వచ్చే కెనాల్ రోడ్డుకు ట్రాఫిక్ మళ్లించినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. సామర్లకోట రోడ్డు ముత్యాలమ్మ గుడి దగ్గర ఓవర్ బ్రిడ్జి గడ్డర్ లాంచ్ పనుల కారణంగా నాలుగు రోజులు ట్రాఫిక్ నిలుపుదల చేస్తున్నామన్నారు. అచ్చంపేట నుంచి సామర్లకోట వరకు జరుగుతున్న పనుల్లో భాగంగా అచ్చంపేట జంక్షన్‌లో గడ్డర్లు లేపుతున్నందున ఈనెల 27, 28 తేదీల్లో రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ట్రాఫిక్ మళ్లిస్తామన్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఓ ప్రకటనలో కోరారు.

'కార్యకర్తే అధినేత'లో అర్జీల స్వీకరణ

పిఠాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తే అధినేత కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, కార్యకర్తల నుంచి వివిధ అంశాలపై మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ వినతులు స్వీకరించారు. అద్దంకి వీరభద్రరావు తదితరులు టిడ్కో అపార్ట్‌మెంట్ కోసం ఆర్జీ ఇవ్వగా పాడా పీడీతో వర్మ ఫోనులో మాట్లాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న చైత్రవర్షిణి

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తెలపాలి

'పాడా' ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి

పిఠాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు సరిగా లేకున్నా, అవి సరైన స్థితిలో లేకున్నా అభ్యంతరాలు తెలిపితే కొత్త వాటిని ప్రతిపాదిస్తామని పాడా ప్రాజెక్టు డైరెక్టర్, పిఠాపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. శుక్రవారం ఆమె అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారుంటే తెలియజేస్తే తొలగిస్తామని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటర్లుగా చేరే అవకాశం ఉందన్నారు. జాబితాలను పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలన చేసిన తప్పులను సవరిస్తామని, ఇందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించాలి

తిమ్మాపురం రైతు సదస్సులో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామశర్మ

పెద్దాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా చేరువ చేయాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.సీతారామశర్మ కోరారు. మండలంలోని జె.తిమ్మాపురంలో శుక్రవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం (రావెప్) విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పద్ధతులు తెలియజేయాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ఆధునిక పద్ధతుల్లో సాగుచేపట్టడం ద్వారా రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. నూతన ఆవిష్కరణలు చేసే రైతులకు అండగా ఉంటూ వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం నూతన వ్యవసాయ నమూనాలను తెలిపే స్టాల్స్‌ను తిలకించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుధీర్, ఏడీఏ దైవకుమార్, దక్షిణామూర్తి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎంపీ సతీష్‌బాబు కార్యాలయ ఇన్‌చార్జి లక్ష్మణమూర్తి

'ప్రజా దర్బార్'కు విశేష స్పందన

కాకినాడ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి తమ సమస్యలను తెలియజేశారు. అర్జీలను ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి స్వీకరించారు. సుమారు 35 అర్జీలు అందగా కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. కూటమి నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వర రావు, తలాటం హరీష్, చింతపల్లి అర్జున్, ఆనంద్‌న్యూటన్, డీఆర్‌యూసీసీ మెంబర్ ముత్యాల అనిల్, బండి నరేంద్ర, యాళ్ల చక్రవర్తి పాల్గొన్నారు.

అందరి సహకారంతో బాలల సురక్షిత జిల్లా సాధ్యం

రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు

కరప, మే 16 (ఆంధ్రజ్యోతి): అందరి సంపూర్ణ సహకారంతో కాకినాడను వంద శాతం బాలల సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దాలనే సంకల్పం సాధ్యమవుతుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు పేర్కొన్నారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో గురువారం పడాల చారిటబుల్ ట్రస్ట్ అధినేత పడాల సూర్యప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బాలలపై జరుగుతున్న అత్యాచారాలు, అకృత్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పిల్లల్లో అవగాహన పెంపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సమాజంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా బాలల్లో ఈ విధమైన చైతన్యం కలుగజేయపోతే చాలా నష్టపోతామన్నారు. ఇంత మంచి కార్యక్రమానికి రెడ్‌క్రాస్ సొసైటీ తరపున పూర్తి సహకారం అందిస్తామంటూ.. దీన్ని రూపకల్పన చేసిన పడాల చారిటబుల్ ట్రస్ట్, సహకరిస్తున్న జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పడాల సూర్యప్రసాద్ మాట్లాడుతూ పిల్లలు క్షేమంగా లేని సమాజం సమాజం కాదని, వారి సంరక్షణను ఎడ్యుకేషన్, ఐసీడీఎస్‌లకే పరిమితం చేయకూడదని, హెల్త్, డ్వామా, డీఆర్డీఏ, పంచాయతీరాజ్‌శాఖల సంపూర్ణ సహకారం కూడా కావాలన్నారు. 100 పర్సంట్ చైల్డ్ సేఫ్టీ ప్రోగ్రామ్ కాన్సెప్ట్‌ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి బాలలు, వారి తల్లిదండ్రులను చైతన్యపరచాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పిల్లల మానసిక పరిస్థితి, 8-12ఏళ్ల వయసులో వారు ఎదుర్కొనే ఇబ్బందులు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాలలు, వారి తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. అడిషనల్ డీఎంహెచ్‌వో రమేష్, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, కరప పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ఏంజిలిన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు. చిత్రంలో పడాల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సూర్యప్రసాద్

'డెంగ్యూ నియంత్రణ అందరి బాధ్యత'

కరప, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిన డెంగ్యూ నియంత్రణ మనందరి బాధ్యతని జిల్లా కుష్టు వ్యాధి నివారణాధికారి, జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రమేష్ సూచించారు. గురువారం ఆయన కరపలో జాతీయ డెంగ్యూ దినోత్సవ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. డెంగ్యూ దోమల నివారణకు చెక్, క్లీన్, కవర్ అనే మూడు పద్ధతులను అనుసరించాలని థీమ్‌గా పెట్టుకున్నామన్నారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, కరప పీహెచ్‌సీ వైద్యాధికారి వి.ఏంజిలిన్, కరప సబ్ యూనిట్ మలేరియా విభాగం అధికారి యాతం నాగబాబు, సీహెచ్‌వో ఏసురత్నం, ఎంపీహెచ్ఎస్ రాజగోపాలరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ అమృతరావు, సబ్‌యూనిట్ ఆఫీసరు డేనియల్, హెల్త్ సూపర్‌వైజరు పి.లక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ గొల్లప్రోలు మండలం తాటిపర్తి, కొడవలి గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమల ద్వారా డెంగ్యూ వ్యాప్తి చెందుతుందని, నీరు నిల్వ ఉండే ప్రాంతాలను శుభ్రం చేయాలని సూచించారు.



కరపలో ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో రమేష్



ఉప్పాడలో రూ.13 కోట్లతో నిర్మించిన చర్చ్

ఫుల్ గాస్పల్ చర్చ్ ప్రారంభం

కొత్తపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీర ప్రాంతంలో ఫుల్ గాస్పల్ చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఆరాధన మందిరాన్ని రాజమహేంద్రవరానికి చెందిన హోసన్నా మినిస్ట్రీస్ నిర్వాహకుడు జాన్‌వెస్లీ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఉప్పాడలో ఫుల్ గాస్పెల్ చర్చిని 55 సంవత్సరాల క్రితం పెంకే ఏసుదాసు ప్రారంభించారు. ఇక్కడ ఆరాధనకు విచ్చేసిన సంఘ సభ్యులు ఇచ్చిన విరాళాలు సుమారు రూ.13 కోట్లతో ఏసుదాసు కుటుంబసభ్యులు అతి విశాలమైన ప్రార్థనా మందిరాన్ని నిర్మించారు. ప్రారంభోత్సవానికి 30వేల మంది సంఘ సభ్యులు హాజరయ్యారు.

ఎండ తీవ్రతతో జనం బెంబేలు

కొత్తపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఎండ తీవ్రత ప్రజలు తాటతీసే విధంగా మంటెక్కించింది. సాయంత్రం వరకు వాతావరణం గుబులుగా మారింది.



పాపిడిదొడ్డి చెరువులో మట్టి తవ్వకాలను వ్యతిరేకిస్తూ అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న రైతులు

మట్టి తవ్వకాలపై రైతుల నిరసన

పిఠాపురం రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెంలోని పాపిడిదొడ్డి చెరువులో ఇటుక బట్టీల వ్యాపారులు, మట్టి మాఫియా మట్టి తవ్వకాలకు సన్నద్ధమవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం రైతులు అర్ధనగ్న ప్రదర్శనతో ఆందోళన నిర్వహించారు. చెరువులో మట్టి తవ్వకాలతో ఆయకట్టు పొలాలకు సాగునీరు అందదని, ఉపాధి శ్రామికులు పనులు కోల్పోతారని రైతులు తెలిపారు. ఒక మహిళా రైతు పేరుపై అనుమతులు తీసుకుని ఇటుక బట్టీలకు మట్టి ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. కలెక్టర్, అధికారులు స్పందించి చెరువులో మట్టి తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ అభ్యంతరాలను కాదని మట్టిని తరలిస్తే అడ్డుకుని తీరతామని స్పష్టం చేశారు. ఆందోళనలో మాజీ జడ్పీటీసీ జవ్వాది కృష్ణమాధవరావు, ముమ్మిడి వెంకన్నబాబు, మలిరెడ్డి పల్లపురాజు, రెడ్డి సత్యనారాయణ, ఎఫ్‌కేపాలెం, కందరాడ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పూడిక తీయక... నీరుపారక

శివారు ఆయకట్టు రైతుల ఆందోళన

పెద్దాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడం రైతులకు శాపంగా మారింది. కాలువల్లో పూడిక భారీగా పేరుకుపోయింది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. శివారు పంట పొలాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడుతోంది. రైతులు నీరు లేకపోవడంతో పంట పొలాలను బీడు భూములుగా వదిలేస్తున్నారు. మొదటి దశలో ఆధునికీకరణ పనులను సుమారు రూ.19కోట్లతో కొంతమేర చేపట్టినప్పటికీ ప్రయోజనం చేకూరలేదు. పైగా వర్షాల కారణంగా ఏటిగట్లు పూర్తిగా బలహీనపడి రైతులు పంట ఉత్పత్తులను తరలించేకునేందుకు వీలుకుదరట్లేదు. మండల పరిధిలోని కట్టమూరు-కాండ్రకోట రహదారిలో ఏలేరు కాలువ ప్రవాహానికి గడిచిన కాలంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లు సైతం ఛిద్రం అయ్యాయి. మండల పరిధిలో సుమారు 10వేల ఎకరాలు ఏలేరు కాలువల మీదనే ఆధారపడి రైతులు పంటలు సాగుచేస్తున్నారు.



కట్టమూరు-కాండ్రకోట మధ్య పూడికతో నిండిపోయిన ఏలేరు కాలువ

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

పిఠాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టువర్టుపేట వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. దీని నుంచి తరచూ మంటలు రావడంతో పరిసర ప్రాంతాలవారు ఆందోళనకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని కలవరపడుతున్నారు. మంటలతో తరచూ ఫ్యూజ్ బాక్సులు కాలిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహించడంతో పాటు రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు రావడంతో కాలిపోయిన ఫ్యూజ్ బాక్స్

'మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు'

గొల్లప్రోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులతో పాటు వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ హెచ్చరించారు. గొల్లప్రోలు పట్టణంలో శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేసి మైనర్లు నడుపుతున్న బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే భారీగా జరిమానా విధించడంతో పాటు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

కాల్వల మరమ్మతులను పర్యవేక్షించాలి

ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలంలో వివిధ పంట కాల్వలు, స్లూయిస్‌లకు మరమ్మతులు చేపట్టనున్నట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అచ్చంపేటలోని తన క్యాంపు కార్యాలయంలో సాగునీటి సంఘాల ప్రతినిధులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. పనులను పర్యవేక్షిస్తూ నాణ్యతా ప్రమాణాలతో అమలు జరిగేలా చూడాలని సూచించారు. సాగునీటి సంఘాల ప్రతినిధులు లేవనెత్తిన పలు అంశాలను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా రైతుల సాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.



తమ డిమాండ్లను నెరవేర్చాలని నినాదాలు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

సామర్లకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై రాష్ట్ర అసోసియేషన్ పిలుపుమేరకు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శుక్రవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. పది రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 15 సంవత్సరాలు పైబడి సర్వీసు ఉన్నవారిని క్రమబద్ధీకరించాలన్నారు. టెక్నికల్ కార్మికులకు నెలకు రూ.29,200 చొప్పున, నాన్‌టెక్నికల్ కార్మికులకు రూ.24,500 చొప్పున వేతనాలు అందజేయాలన్నారు. రామరాజు, కృష్ణ, రత్నరాజు, రమేష్, మురళీకృష్ణ, సత్యనారాయణ, భూదేవి, నాగార్జున, వెంకటేశ్వరరావు, స్వామి, రాజేష్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై వీధి నాటకాల ద్వారా అవగాహన

గొల్లప్రోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ హెచ్‌ఐవీపై గొల్లప్రోలు బస్టాండు, టోల్‌ప్లాజా వద్ద వీధి నాటకాల ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ, కాకినాడ ఎయిడ్స్ క్లస్టర్ సంయుక్త నిర్వహణలో హెచ్‌ఐవీ, సుఖవ్యాధులు ఎలా సంక్రమిస్తాయి, నివారణ ఎలా వివరించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి ఆర్.రమేష్, కేవీఆర్ శైలజ, చేంజెస్ సంస్థ ప్రతినిధి కె.పుష్పాకుమారి, గొల్లప్రోలు నగర పంచాయతీ మేనేజరు నవీన్‌చంద్ర, పీహెచ్‌సీ విజిటర్ బాషా, పి.లక్ష్మీరవణమ్మ, ఐసీటీసీ కౌన్సిలర్ లక్ష్మి, సరస్వతి, దుర్గాభవానీ పాల్గొన్నారు.



నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జాతీయ సహ కన్వీనర్‌గా మణికుమార్

పిఠాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ జాతీయ సహ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన దువ్వా మణికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ చైర్మన్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మానవహక్కుల పరిరక్షణకు అంకితభావంతో పనిచేస్తానని మణికుమార్ చెప్పారు.



ధ్వజస్తంభాన్ని తాళ్లతో తాత్కాలికంగా కట్టిన దృశ్యం

ధ్వజస్తంభం పడిపోకుండా రక్షణ చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గొల్లప్రోలు, మే 16 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానం (విష్ణాలయం) ఆవరణలో ధ్వజస్తంభం లోపల చెక్క చెడపట్టడంతో శిఖర భాగం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉందని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనరు డీఎల్వీ రమేష్‌బాబు, కాకినాడ జిల్లా అధికారి ఈవీ సుబ్బారావు ఆదేశాల మేరకు ఆలయ ప్రత్యేకాధికారి టీవీ సూర్యనారాయణ, ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలన జరిపారు. ముందుజాగ్రత్త చర్యగా తాళ్లతో కట్టి ధ్వజస్తంభానికి రక్షణ కల్పించారు. దీనిని గతంలో ఏర్పాటుచేసిన దాత దంగేటి వెంకటరమణ కొత్త కర్రతో ధ్వజస్తంభానికి మరమ్మతుల నిర్వహణకు అనుమతి కోరుతూ కమిషనరుకు లేఖ రాశారని ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, సింగిల్ ట్రస్టీ బీవీ రమణమూర్తి తెలిపారు.



బీమా సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ. 5 లక్షల బీమా అందజేత

సామర్లకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త పెంకే అప్పారావు ఇటీవల అకస్మికంగా మృతి చెందాడు. కార్యకర్తల బీమా పథకంలో మంజూరైన రూ.5లక్షల సాయాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అప్పారావు కుటుంబసభ్యులకు శుక్రవారం అందజేశారు.



వైద్య చికిత్స నిమిత్తం

సామర్లకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురానికి చెందిన పుప్పాల పూర్ణాదుర్గాప్రసాద్ బోన్‌మెరో వ్యాధితో బాధపడుతున్నాడు. ఆ గ్రామ టీడీపీ నాయకుడు చల్లా బుజ్జి అందించిన సమాచారంతో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సత్వరం స్పందించి తన వ్యక్తిగత సాయంగా రూ.50వేలు ప్రకటించారు. ఈ మొత్తాన్ని టీడీపీ నాయకులు చల్లా బుజ్జి, కోట అప్పారావు సమక్షంలో దుర్గాప్రసాద్‌కు శుక్రవారం అందజేశారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజప్ప భరోసా ఇచ్చారు.

శ్యాంబాబు సంతాప సభకు తరలిరండి

శంఖవరం, మే 16(ఆంధ్రజ్యోతి): ఉద్యమాల సూర్యుడు, అణగారిన కులాల ఆశాజ్యోతి శ్యాంబాబు మాదిగ సంతాప సభకు జిల్లాలో మాదిగలంతా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండెంపూడి ఉదయ్ కోరారు. కత్తిపూడిలో దళిత సంఘాల నేతలతో శుక్రవారం సమావేశమై మాట్లాడుతూ ఈనెల 19న కాకినాడలో జరిగే సభకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వస్తారని, భారీ స్థాయిలో మాదిగలు హాజరుకావాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

'ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కిరణ్

కూనవరం, మే 16(ఆంధ్రజ్యోతి): రాబోయే గోదావరి వరదలు దృష్టిలో ఉంచుకుని ముంపు ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ అన్నారు. మండలంలోని ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముంపునకు గురికాని ప్రాంతాల్లో ముందుగా బఫర్‌స్టాక్ ఏర్పాటు చేయాలన్నారు. వరదలు సమయంలో ప్రత్యామ్నాయంగా ముంపులేని ప్రాంతాల నుంచి విద్యుత్‌లైన్ వేయాలన్నారు. అదేవిధంగా వరదలు సమయంలో కూనవరం-భద్రాచలంనకు బోదునూరు మీదుగా భద్రాచలానికి రోడ్డును ఏర్పాటుచేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు సున్నం రాజులు, మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బొర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికల్లో ఐక్యతతో కమిటీని ఎన్నుకోవాలి

కూనవరం, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆపార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఐక్యతతో పార్టీ కమిటీని ఎన్నుకోవాలన్నారు. ప్రతీ కార్యకర్త క్రమశిక్షణతో ఉండాలన్నారు. పార్టీ ఎదుగుదలకు ప్రతీఒక్కరూ కృషిచేయాలన్నారు. తొమ్మిది మంది కమిటీ సభ్యుల్లో ఆరుగురు హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. ఆదివారం నాటికి టీడీపీ మండల నూతన అధ్యక్షుడిని ఎన్నుకునే అవకాశం ఉంది. కార్యక్రమంలో టీడీపీ అరకు పార్లమెంటు సభ్యుడు ఎడవిల్లి భాస్కరరావు, పొడియం అప్పారావు, చందు, చెలకాని ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ


ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ మానవహక్కుల పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌హెచ్‌ఆర్‌పి ఫోరం మండల ప్రెసిడెంట్ లింగేటి గౌరీ శివలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ షైలబోయిన రమణి, సెక్రటరీ సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్‌హెచ్‌ఆర్‌పీ ఫోరం రాష్ట్ర ఇన్‌చార్జి వలీఖాన్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాంప్రసాద్, మహిళా విభాగం ఇన్‌చార్జి శ్రీదేవి హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఎస్‌హెచ్‌ఆర్‌పీ ఫోరం కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో పున్నపు చిన్నతమ్మారావు మాస్టారు ఆర్థిక సాయంతో ప్రభుత్వాస్పత్రి రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ఇన్‌చార్జి ఖాన్ మాట్లాడుతూ మానవహక్కుల ఉల్లంఘన జరిగితే ఏవిధంగా స్పందించాలి, హక్కుల రక్షణకు ఎలా కృషిచేయాలో వివరించారు. మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయిస్తే జరిగే న్యాయంపై తెలియజేశారు. కార్యక్రమంలో మానవహక్కుల సంఘం ప్రభాకర్, జగన్నాథస్వామిదొర, సురేష్‌కుమార్, పాతర పద్మావతి, యు గందర్, వెంకటసాయి, డి.నాగేంద్ర, డి.సూర్యనారాయణ, బి.రామకృష్ణ, వెంకటరమణ, ఎస్‌కెబి నవాజ్, గోపి, వీరరాఘవ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ : ఎంపీపీ


డెంగ్యూ నివారణ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి, మే 16(ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే డెంగ్యూ నివారించడమే కాకుండా దోమలవల్ల వచ్చే అనేక రోగాలను అరికట్టవచ్చని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని లాగరాయి పీహెచ్‌సీ పరిధిలోగల కింద్ర గ్రామంలో మెడికల్ సిబ్బంది డెంగ్యూను ఓడించండి, పరిశీలించండి, శుభ్రం చేయండి, మూత పెట్టండి అనే నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుర్గా ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, మెడికల్ సిబ్బంది, జీడీ కృపానందం, ఎం.సోమినాయుడు, రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగులు విధులకు గైర్హాజరైతే చర్యలు


శానిటేషన్ పరిశీలిస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, మే 16(ఆంధ్రకజ్యోతి): ముందస్తు అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరు అయితే జీతాలు నిలుపుదల చేయడంతోపాటు క్రమశిక్షణ చర్యలు తప్పవని సచివాలయ ఉద్యోగులను ఎంపీడీవో బాపన్నదొర హెచ్చరించారు. శుక్రవారం ఆయన కె.యర్రగొండ, కోట సచివాలయాల్లో తనిఖీలు చేపట్టారు. కార్యాలయాల్లో సమయపాలన పాటించాలన్నారు. యర్రంరెడ్డిపాలెం, నూగంటిపాలెం, పుట్టపల్లి గ్రామాల్లో మలేరియా జ్వరాలు ఉన్నాయని ప్రతీరోజూ శానిటేషన్ చేపట్టాలని సచివాలయ, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. వాటర్ ట్యాంకులు, చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించి సూచనలిచ్చారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మణికంఠ పాల్గొన్నారు.

'ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి'


ఐటీడీఏ ఏపీవో జగన్నాథరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

చింతూరు, మే 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదివాసీలకు ఇచ్చినహామీ నిలబెట్టుకోవాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్, డివిజన్ చైర్మన్ జల్లి నరేష్ డిమాండ్ చేశారు. మన్యంలో నూరు శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని ఆది వాసీ జేఏసీ డిమాండ్ చేస్తోంది. ఇందులోభాగంగా చింతూరు ఐటీడీఏ ముందు రిలే దీక్షలు చేపట్టారు. రెండో రోజైన శుక్రవారం దీక్షను అటవీశాఖ సెక్షన్ అధికారి తిమ్మసాయి, వీఆర్వో ముచ్చిక సింగయ్యలు ప్రారంభించారు. అనంతరం కుంజా అనిల్, జల్లి నరేష్‌లు మాట్లాడారు. ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్‌ని తక్షణమే ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రత్యేక డీఎస్సీ ద్వారా మన్యంలో ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలన్నారు. చివరిగా తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐటీడీఏ ఏపీవో జగన్నాథరావుకు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ డివిజన్ సలహాదారుడు అటవీశాఖ సెక్షన్ అధికారి తోడెం చంద్రయ్య, నాయకులు బొడ్డు బలరాం, కాక సీతారామయ్య, సోడె అర్జున్, బీరబోయిన అప్పారావు, శేఖర్ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పాఠ్య పుస్తకాలు సిద్ధం

● ప్రభుత్వ పాఠశాలలకు చేరిన నోట్ పుస్తకాలు
● మూడు రకాల బ్యాగ్స్ పంపిణీ


ఏలేశ్వరం బాలికోన్నత పాఠశాలలో భద్రపరిచిన పుస్తకాలు

ఏలేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి విద్యపై ప్రాధాన్యం చూపుతోంది. జూన్ రెండో వారంలో ప్రారంభమయ్యే పాఠశాలకు సంబంధించి పుస్తకాలను సిద్ధం చేసింది. ప్రభుత్వ పాఠశాలల పాఠ్య, నోట్ పుస్తకాలు ఏలేశ్వరం మండలానికి ముందుగానే చేరుకున్నాయి. మండలవ్యాప్తంగా 40ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటికి నోట్ పుస్తకాలు 37,247, పాఠ్య పుస్తకాలు 22,965 చేరినట్టు ఎంఈవో 2 వరలక్ష్మీ తెలిపారు. ఈఏడాది ఒకటి నుంచి పదో తరగతి పుస్తకాలు రావల్సి ఉండగా 7, 8 తరగతికి తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టుల పుస్తకాలు వచ్చాయన్నారు. ఆరో తరగతికి సంబంధించి తెలుగు, ఇంగ్లీషు, హిందీ కలిపి ఒక పుస్తకం ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పుస్తకాలన్నింటినీ ఒకే సారి పంపిణీ చేస్తామన్నారు. 6, 7తరగతులకు రెండొందల పేజీల తెల్లకాగితాలు పుస్తకాలు మూడు, రూల్‌పుస్తకాలు నాలుగు, బ్రాడ్‌రూల్స్ పుస్తకం ఒకటి చొప్పున ఎనిమిది నోట్ పుస్తకాలు విద్యార్థులకు అందజేయనున్నట్టు ఆమె పేర్కొన్నారు. ఈవిద్యా సంవత్సరం తరగతుల ఆధారంగా విద్యార్థులకు బ్యాగులు అందించనున్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం మూడు రకాల బ్యాగులను సిద్ధం చేసింది. ఒకటి నుంచి రెండో తరగతి విద్యార్థులకు చిన్న సైజు, మూడు నుంచి ఐదు వరకు మీడియం, ఆరు నుంచి పదో తరగతి వరకు పెద్ద సైజు బ్యాగులు ఇవ్వనుంది. బెల్టులు, సాక్సులు, బూట్లు, యూనిఫాం అన్ని కలిపి పుస్తకాలతో అందజేస్తామని ఎంఈవో2 వివరించారు.

'కార్మికుల హక్కులను కాలరాస్తే సహించం'



శంఖవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న లిబరేషన్ పార్టీ సభ్యులు

శంఖవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తే సహించబోమని, పోరాటాలు చేస్తామని సీపీఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీసభ్యుడు మానుకొండ లచ్చబాబు హెచ్చరించారు. జూలై 9న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం శంఖవరంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ కార్మికులకు ఆరువందల కూలీ, రెండువందల పనిదినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. చింతలూరు లోకల్ కమిటీ కార్యదర్శి దాడి నాగేశ్వరరావు, దుముల సింహాచలం, తాడి లక్ష్మణరావు, జంకల అప్పారావు, తూము చంద్రబాబు, అడుగుల అప్పారావు, లోడ అప్పారావు పాల్గొన్నారు.

గ్రామస్తుల మొక్కు కోసం ఎమ్మెల్యే పాదయాత్ర


రాజుపేట గ్రామస్తులతో కలిసి పాదయాత్ర చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): తమ అభిమాన నేత, యనమల బిడ్డ అసెంబ్లీలో అడుగుపెడితే మొక్కుకున్న రాజుపేట గ్రామస్తులు మాట ప్రకారం మొక్కు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి రాజుపేట నుంచి లోవ దేవస్థానం వరకు ఎమ్మెల్యే దివ్య పాదయాత్ర చేశారు. ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కు చెల్లించారు. ఆమె వెంట పెద్ద ఎత్తున మహిళలు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూకు సత్కారం



జగ్గంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలరీ కనస్ట్రక్షన్‌కి సహకరించినందున ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూని స్థానిక రావులమ్మనగర్‌లో క్యాంపు ఆఫీస్‌లో నియోజకవర్గ మండల విద్యాశాఖ అధికారులు రాయి స్వామి, సుబ్రమణ్యేశ్వరరావు, నాయక్, చిన్నారావు, జిల్లా యూటీఎఫ్ నాయకులు పడాల వీరవెంకటసత్య నారాయణ తదితరులు ధన్యవాదాలు తెలియజేసి ఎమ్మెల్యేని సత్కరించారు.

ఎమ్మెల్యే సత్యప్రభకు కృతజ్ఞతలు

ప్రత్తిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో 60 పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్పుచేసి, ప్రతి తరగతికి ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు 8యూపీ స్కూల్స్‌ను హై స్కూల్స్‌గా అప్‌గ్రేడ్‌గా చేయడానికి సహకరించిన ఎమ్మెల్యే సత్యప్రభ రాజాను విద్యాశాఖాధికారులు అభినందించారు. శుక్రవారం ఎమ్మెల్యేను నియోజకవర్గ విద్యాశాఖాధికారులు కలిసి సన్మానించారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే దివ్య


తిమ్మాపురం గ్రామస్తుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

తుని రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తుని మండలం తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించి అధికారులతో కలిసి ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను గడువులోపు పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఇల్లు నిర్మాణానికి అర్జీలు పెద్ద మొత్తంలో అందాయని, పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని దివ్య తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ నాగ జగదీష్, యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, కాపారపు అబ్బులు, అత్తి అచ్యుతరారావు తదితరులు ఉన్నారు.

నేడు జగ్గంపేటలో మినీ మహానాడు


ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): గోకవరం రోడ్డులోని కాపు కల్యాణ మండపంలో జగ్గంపేట నియోజకవర్గం టీడీపీ మినీమహానాడు శనివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలియజేశారు. శుక్రవారం కాపు కల్యాణ మండలంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతి థిగా హాజరవుతారు. నియోజకవర్గంలోని 4మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నియోజకవర్గంలోని టీడీపీ సంస్థాగత ఎన్నికలు, పార్టీ పటిష్టత కోసం పలు తీర్మానాలు చేయనున్నట్టు తెలిపారు. ఈనెల22న జిల్లా మహానాడు, ఈనెల 27,28,29 తేదీల్లో కడపలో టీడీపీ మహానాడు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంపీపీలు, జడ్పీటీసీలు, టీడీపీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తా చాటిన ఆదిత్య విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఆదిత్య వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి

గండేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఈ-సెట్ ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించినట్టు విద్యాసంస్థల వైస్ చైర్మన్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. ఏపీ ఈ-సెట్ 2025 పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు స్టేట్ 5,8 ర్యాంకులతో పాటు వందలోపు 41 ర్యాంకులను సాధించినట్టు పేర్కొన్నారు. మద్దూరి వినయ్ 5వ ర్యాంక్, చీకోలు అమృత 8వ ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయి టాప్ పదిలో 2ర్యాంకులను, వందలోపు 41ర్యాంకులను తమ విద్యార్థులు సొంతం చేసుకున్నట్టు తెలిపారు. విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ ఎస్.శేషారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్. కుమార్, డీన్ ఏపీ మాధవరావు, అపోసియేట్ డీన్ పి.శ్రీనివాస్ అభినందించారు.

రాచపల్లిలో వంటావార్పుతో నిరసన


యాదవ సంఘం ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాచపల్లిలో శుక్రవారం యాదవ సంఘం ఆధ్వ ర్యంలో వంటావార్పుతో ఆందోళన చేపట్టారు. సర్వే నెంబరు 157/2లో 60 సెంట్ల స్థలం యాదవల ఆధీనంలో ఉందని, అయితే ఇటీవల అగ్రవర్ణాలకు చెందిన వారు ఈభూమి తమదేనంటూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. యాదవుల ఆందోళనకు ఎంపీటీసీ బుద్దరాజు రామలక్ష్మీచంటిరాజులు సంఘీభావం తెలిపారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ


ఏలేశ్వరంలో వైద్య సిబ్బంది ర్యాలీ

ఏలేశ్వరం, మే 16(ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగీ మహమ్మారిని తరిమికొట్టవచ్చని ప్రభుత్వాసుపత్రి వైద్యులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నేతృత్వంలో జాతీయ డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీనిర్వహించారు. దోమల ద్వారా డెంగీ వ్యాధి వ్యాపిస్తోందని, ప్రతీ ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాచపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది, స్థానికులు ప్రదర్శన నిర్వహించారు. తాగిపడేసిన కొబ్బరి బొండాలు, ఎయిర్ కూలర్లు, ఫ్రిజ్‌లు వంటి చోట్ల డెంగ్యూదోమ లార్వా గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతుందని, దీని నివారణకు ముందస్తుగానే చర్యలు చేపట్టాలని పీహెచ్‌సీ వైద్యాధికారి గీత సుధ తెలిపారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారి ఆనంద్, ఎల్‌టీ అజయ్, పీహెచ్‌ఎస్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరంలో తిరంగ ర్యాలీ


మాజీ సైనిక ఉద్యోగిని సన్మానిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతి చర్యగా ఆపరేషన్ సిందూర్ విజ యం ప్రపంచానికి మన సైనికుల వీరత్వానికి నిదర్శనమని ఎస్టీ కమి షన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. శుక్రవారం రంపచోడవరంలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగి గోవిందరావును సత్కరించారు. బీజేపీ నాయకులు ఈక బుల్లికొండలు దొర, కారం సీతారమన్న దొర, గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, కె.ఎల్.ఎన్. గురుప్రసాద్, కుంజం వెంక టేశ్వర్లుదొర, కంగల శ్రీనివాసు, మైనార్టీ నాయకులు గౌస్‌మొహిద్దీన్, శారపు వీరప్రతాప్‌దొర, మడకం ప్రసాద్, కారం రామన్నదొర, తుర్రం బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే


చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జిరెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేను ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి వితరణ


ఇంటి నిర్మాణ సామగ్రి అందిస్తున్న దృశ్యం

చింతూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రెండు పేద ఆదివాసీ కటుంబాలకు జేకేసీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ఉచితంగా ఇంటి నిర్మాణ సామగ్రిని శుక్రవారం అందజేశారు. పేగ గ్రామానికి చెందిన కూర లక్ష్మయ్య, కూర ముదిరాజ్‌లకు సరైన గృహాలులేక ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలంలో వారు పడుతున్న ఇక్కట్లను జమాల్‌ఖాన్ దృష్టికి రావడంతో రేకుల ఇల్లు నిర్మాణం చేసుకొనేందుకుగాను సామగ్రిని అందజేశారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివారావు, టీడీపీ నాయకులు ఎండీ జహంగీర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పసుపులేటి సాల్మన్‌రాజు, అనిగి చంద్రయ్య, తుర్రం బాబూరావు, ట్రస్ట్ సభ్యులు సయ్యద్ సమీర్, తదితరులు పాల్గొన్నారు.

సోమాలమ్మ ఆలయం వద్ద భారీ అన్నదానం

జగ్గంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద శ్రీసోమాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏటా వార్షికోత్సవం సందర్భంగా ఐదు రోజులు ఉత్సవాలు నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహిస్తామని భారతీ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి, ఆలయ కమిటీ సభ్యులు ముమ్మిడివరపు లలితబాబు తెలిపారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే నెహ్రూ స్థలం కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీవన మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, రేఖ బుల్లిరాజు, బస్వా చినబాబు, భూపాలపట్నం ప్రసాద్, మండపాక అప్పన్న దొర, రాయి సాయి పాల్గొన్నారు.

మినీ మహానాడుకు నాయకులు తరలిరండి

గండేపల్లి, మే16(ఆంధ్రజ్యోతి):శనివారం జగ్గంపేట కాపు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆధ్వ ర్యంలో నిర్వహించే మినీమహానాడు కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు కోరారు.

ప్రత్తిపాడులో అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయండి

ప్రత్తిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని సెక్రటరేట్‌లో సీఎం చంద్రబాబుకు చిట్టిబాబు వినతిపత్రం అందజేశారు. ప్రత్తిపాడులో సింగిల్ జడ్జి కోర్టు ఉండలం వల్ల పెండింగ్ కేసులు పెరుగుతున్నాయని, అడిషనల్ కోర్టు ఏర్పాటు చేయడం వల్ల పెండింగ్ కేసులు పరిష్కారంతో పాటు ఇతర జడ్జిలు పనిచేయడం ద్వారా కక్షిదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

పూరిల్లు దగ్ధం

తొండంగి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏ.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో శివకోటి అప్పారావుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను అదుపు చేశారు. రూ.50 వేల ఆస్తి నష్టం ఏర్పడింది.

నేడు తొండంగిలో ఎమ్మెల్యే దివ్య పర్యటన

తొండంగి, మే 16 (ఆంధ్రజ్యోతి): తుని ఎమ్మెల్యే యనమల దివ్య శనివారం తొండంగి మండలంలో పర్యటిస్తారని ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు తొండంగిలో, 11గంటలకు ఏవీనగరంలో కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నిత్యావసరాల పంపిణీ

గండేపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సూరపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పెద్దాపురంలో మన ఇల్లు వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులు, గ్లూకోజ్, పండ్లు అందజేశారు. వారిని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఎన్ ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

యనమలను సత్కరించిన ఎమ్మెల్యే సత్యప్రభ



ప్రత్తిపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఘనంగా సత్కరించారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన యనమలను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. టీడీపీ నాయకులు యాళ్ళ జగదీష్, గొంతిన సురేష్, పల్లా గోపి, మంతెన శ్రీను, నాగేశ్వరరావు, పోలిశెట్టి శ్రీనివాసు, అడ్డాల త్రిమూర్తులు పాల్గొన్నారు.